## 10. గంగ ప్రార్థన

శరను శరను మాయమ్మ రావె శాంబవీ రావే
కరున జూడు మాయమ్మ తల్లి గంగాభవాని గనకల్పవల్లి
ముందుమా యాదవులకు మూలదేవత మూలదేవత
గంగ వచ్చె సూడరమ్మ గాలిమే గాన గాలి మేగాన

ఇలా అన్ని రకాల దేవతల ప్రార్థనలు చేసి కథ చెబుతారు. కథల్లో ప్రధాన కథకుడు రకరకాల పాత్రాభినయం చేస్తాడు. ఒగ్గుడోలు గతికి అనుగుణంగా అడుగులుంటాయి. చివరగా మంగళం పాటతో ముగిస్తారు.

మంగళం మాదేవీ లాలి మమ్మాదుకో మాంకాళి దేవి
మంగళం మంగళం ఆ దేవలాలీ
యీ పుణ్యాభూమికి నీవే మాతవు
నీవే కట్టజీవుల జూసి కనికరించిన తల్లి
మంగళం మా దేవలాలీ మమ్మాదుకో మాంకాలి దేవి
మమ్మాదుకోగా మాంకాలి దేవి..

కోస్తా ప్రాంత ప్రత్యేక కళారూపం - తప్పెట గుళ్ళు

తప్పెట, చర్మవాద్యం, దీన్ని డప్పు, పలక అంటారు. గుండె మీద (దామ్యల మీద) వీపుకు కట్టుకుంటారు. రెండు చేతులతో లయాత్మకంగా కొడతారు. 'గుండె తప్పెట్లు' అని ఒకప్పుడు వ్యవహారం కాలక్రమంలో తప్పెట గుళ్ళుగా మారిపోయింది. కోస్తా ప్రాంతంలో ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ పట్టణం జిల్లాల్లో శ్రీకృష్ణాష్టమి రోజు తప్పకుండా ప్రదర్శి స్తారు. సుమారు 20 మందికి పైగా కళాకారులుంటారు. యర్రటి శెడ్డీలు వాటికి మూగలు కట్టి వుంటాయి. బనీను కెనక భాగంలో తోకలాగ యర్రటి బట్టవేలాడదీస్తారు. కాళ్ళకు గజ్జెలుంటాయి. రకరకాల అడుగులు పాట కనుగుణంగా వేస్తారు. యాదవ కులం వారు ప్రదర్శిస్తారు. మొదటగా ప్రార్థన పాడుతారు.

"గననాత నీ పూజ గనముగ చేసేము
మునినాత నీ పూజ ముందూగ చేసేమూ"

తర్వాత శ్రీ కృష్ణునిమీద పాటలు పాడుతారు. బృంద మంతా గుండ్రాకారంగా తిరుగుతూ అడుగులు వేస్తుండగా ఒకరు మధ్యలో గిర్రున తిరుగుతూ నేలపై దబేలుమని పడటం చూపరులను ఆకట్టుకుంటుంది. ఒకరి మీద ఒకరు ఎక్కుతూ వుట్లు కట్టే దృశ్యం చూడముచ్చటగా ఉంటుంది.

రాయల సీమ ప్రాంత ప్రత్యేక కళారూపం - ఉరుములు

ఉరుము చర్మవాద్యం ఉరుమును కొట్టేవారిని ఉరుము లొల్లు అంటారు. మాల కులంలో ఒక తెగ గ్రామ దేవతలైన గంగమ్మ, వీర తిమ్మమ్మ, వీర నారాయణ స్వామి, అక్కదే వతలు, పోతలయ్య, మొదలగు వారి దగ్గర పూజారికి పూనకం తెప్పించడానికి పరాకు చెప్పి మేలుకొలుపు పాడి ఉరుమును కొడతారు.

ఉరుము వాద్యం కొడుతుండగా కుంచెల నృత్యం ప్రదర్శిస్తారు. నెమలి ఈకలతో కుంచెను తయారు చేసుకొని నెమళ్ళలాగా ప్రదర్శిస్తారు. ఉరుము వాద్యంపై 'యరడడ్డ బూర్ బూర్ బూడడ్డో' అనే గతిని కొడతారు. వాద్యం పొట్టపై ఉండేలా తగిలించుకొని కుడిచేతి పుల్లతో 'డవ్‌డవ్' అనే శబ్దం, ఎడమ చేతిపుల్లతో 'బూర్ బూర్' అనే శబ్దం పుట్టిస్తారు.

ఆకాశంలో మేఘ గర్జన (ఉరుము) సమయంలో మెరుపులు వస్తే అడవిలోని నెమలి నృత్యం చేస్తుంది. ఇది ప్రకృతి సిద్ధం. అలాగే మేఘగర్జన అంటే ఉరుము లాగా వాద్యం తయారు చేసుకున్నారు. జానపదులు నెమళ్ళలాగా అలంకరించుకొని కుంచెల నృత్యం ప్రదర్శిస్తారు. గిరిజన నృత్యాల ద్వారా జానపద నృత్యాలు జానపద నృత్యాల ద్వారా శాస్త్రీయ నృత్యాలు పుట్టాయనటానికి నిదర్శనం.

### పరాకు పాట

స్వామి వారి ఫరాకు పరాకు, యచ్చరికె పరాకు, మనవాలకించు మందవపడితివమ్మా మాయకారి గంగా, దొడ్డన పుడితివమ్మ దొనకొండ గంగవో వేగంగా మేలుకో వోగంగ మేలుకో

మేలుకొలుపు గేయం
మేలుకొనవే వో గంగమాత మేలుకొనవే
అమ్మా నీవు పుట్టక ముందే నాడు
తూరుపు లేదు పడమటలేదు ॥మేలు॥
అమ్మా నీవు పుట్టక ముందేనాడు
ఉత్రమూ లేదు పరదచ్చినమూలేదు ॥మేలు॥
అమ్మా నీవు పుట్టకముందేనాడు
రాసెన్ని వో బ్రహ్మదేవుడూ లేడు ॥మేలు॥

### మంగళం పాట

జయ జయ మంగళం నిత్యసుబమంగళం ॥జయ॥
బాలు బోలు మట్టెలు బాలు బాలు మట్టెలు
బొమ్మం చుసీరలు తనుకు తనుకున మెరిసేటి
తనుకు పాపెటి బొట్టు తగునమ్మవేటి కర్ణపెద్దమ్మకు
ఒక్కొక్క జల్లోన వజ్రకాంతి లింగాలు
ఒక్కొక్క జల్లోన భద్రకాంతి లింగాలు
జడ జడా సుస్తీను నవకోటి లింగాలు
తగునమ్మ వేటి కోర్ల గంగమ్మకు ॥జయ॥

**డా॥ చిగిచర్ల కృష్ణారెడ్డి**
శాఖాధిపతి, జానపద కళలశాఖ
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్